పెదిమలమీది బూరెలు

# శుష్క ప్రియాలు

అవసరాల రామకృష్ణారావు

ఎదురుగుండా ఉన్న యిల్లు అంటుకుంది.

తాటాకుల పాకా, పక్కనున్న పెంకుటిల్లూ రెండూ అంటుకున్నాయి. చిటపట చప్పుళ్ళూ, ఎదుటి మనిషి కనపడని గాఢమైన పొగా, నీళ్ళ కోసం పరిగెత్తేవారి కేకలూ, ఇంట్లో సామాన్లు బయటు చేరవేస్తున్న శబ్దాలూ, ఆడవాళ్ళ ఏడుపులూ, దృశ్యం అత్యంత భయంకరంగా ఉంది. ఆ సమయంలో యీ కబురు చెప్పడానికి స్నేహితుడు శర్మ అతి కంగారుతో రామాన్ని లేపడానికి వచ్చాడు. రామం మేడగదిలో ముసుగెట్టుకు పడుకున్నాడు. ఎదురిల్లు కాలుతో ఉంటే అలా తెలివిగా పడుకున్న వాడిని చూస్తే శర్మకి ఛళ్లని లెంపకాయ కొట్టు బుద్ధివేసింది.

"ఏంరా యింకా అలా పడుకున్నావ్?"

"లేచి నువ్వూ నేనూ ఏంచెయ్యగలం?"

"అందరూ అలా అనుకుంటే యిల్లెలా ఆరుతుంది?"

"అందరిమాటా నాకు తెలియదు భాయ్, మా అమ్మకి నేను ఒక్కణ్ణే. నేను ఏమాత్రం బాధపడినా ఆవిడ సహించలేదు. లేకపోతే నిలుచున్న పాళంగా రానూ? ఆ దృశ్యం చూడలేక కళ్ళు మూతలుపడిపోయాయి అనుకో."

శర్మకి కోపం ఆగలేదు.

"కళ్లు మూతలుపడలేదు, పోయాయి అను. వెనక గాంధారీ యిలాగే పుట్టుగ్రుడ్డి అయిన ధృతరాష్ట్రుడికి ఎక్కడ సేవచెయ్యవలసివస్తుందో అని 'భర్తకి లేనికళ్ళు నాకెందుకూ?' అని పైకి పతివ్రతననిపించుకుని రెండుకళ్లూ కట్టేసుకుందిట. నీతో 'డిస్కషన్'కి నాకు టైములేదు. అయితే ఒకటి, కార్యసాధనలో మనమెప్పుడూ వెనకడుగే. ఉన్నదున్నట్టు చెప్పడం అయినా అలవాటు చేసుకో."

ఆదేదో పెద్ద గడుసుదనమూ, తెలివితేటలు అనుకుని మనం ఎవరికీ ఏవిధంగానూ సాయపడక పోయినా తియ్యని మాటలతో మొహం మొత్తు దామని నిత్యం చూస్తూంటాం. ముష్టివాడు బిచ్చానికివస్తే "పోరా పో, యిప్పుడేంలేదు" అని చెప్పడం ఒకటేమాట, రాజుమాట. "అయ్యో పాపం నీకు నాలుగురోజుల్నుండి గంజే లేదూ? నీలాంటివాళ్ళని చూస్తే నాకు చెప్పలేని జాలీ, వర్ణించలేని అభిమానమున్నూ. ఒక్క అడుగు ముందువస్తే కడుపునిండా భోజనం పెట్టి పంపే దాన్ని. ఇప్పుడే ఊడ్చి దాసీదానికి పెట్టేశాను. వెళ్ళమ్మా వెళ్ళు" అనడం ఎలా ఉంది? ఈ శుష్క ప్రియవచనాలతో వాడికి వచ్చేది, పోయేదీ ఏమీలేదుగాని అక్కర్లేని అబద్ధాలు చెప్పి ఆత్మవంచనచేసుకుంటున్నామని గ్రహించుకుంటే మంచిది. పక్కింటికి పంచదారకి పంపిస్తే "ఎవరమ్మా కబురంపించింది, నాతల్లి సుబ్బమ్మ వదినేనా? పాపం ఎంతో అవసరమొస్తేగాని నోరు మెదిపి ఎరగదు. లేదని చెప్పడానికి నాప్రాణం ఎంత గిలగిల తన్నుకుంటుందో ఆ సీతారాముడికే తెలుసు. మరోలా అనుకుంటే నామీద ఒట్టని మరీమరీ చెప్పనాయనా" అనేవాళ్ళు ఎంతమందని! మనంసంఘజీవులం. ఒకరిఅవసరం ఒకరికి లేకుండా రోజులు వెళ్ళవు. కార్డుముక్క దగ్గిర్నుంచి పది రూపాయల అప్పువరకు ఒకర్నొకరు అడగందే నెలాఖరు వెళ్ళదు. ఇస్తే ఇవ్వాలి లేకపోతే నోరు మూసుకుని ఊరుకోవాలి. ఏదో సాగదీసుకుని లౌక్యంగా చెప్పడంలో ఎవరికేమిసౌఖ్యం?

* * *

శరత్ బాబు "పతివ్రత" చదివారనుకుంటాను. అందులో హారీశుడు మంచిపేరు ప్రఖ్యాతులు సంపాదించిన వకీలు. చాలా సౌమ్యుడు. అతని భార్య లోకం దృష్టిలో మహాపతివ్రత. అంటే

దుశ్శీల అని కాదుగాని ఆమె భర్తృసేవ తెలియాలంటే ఒక్క సంగతి చెబితేచాలు. హరీశుడికి వత్తుగా స్ఫోటకంపోసి వైద్యులు బ్రతకడం కష్టమన్నారు. వెంటనే అతనిభార్య నిర్మల ఏంచేసిందనుకున్నారూ? ఎకాఎకీని అంకమ్మగుడికి వెళ్లి, "నేనే గనక పతివ్రత కూతురు పతివ్రతనైతే, నా పసుపు కుంకుమ చెరిపి వెయ్యడానికి ఎవరితరం? వారు బ్రతికితేనే నేను యిక్కడ్నుంచి కదిలేది" అని పట్టెడు కుంకం నొసటను పెట్టుకుని అక్కడనే కూర్చుంది. "ఈమె మనిషా, సాక్షాత్తు కాళికాదేవి గాని?" అనుకున్నారు ప్రజలు. నోట్లో రెండు మంచినీళ్ళు పోసే దిక్కులేక ఓ మూల గదిలో హరీశుడు మాత్రం "ఇది పతివ్రతా! సాక్షాత్కృత్య దేవతగాని!" అని మనసులో అనుకుని ఉంటాడు!

* * *

"కీర్తికావాలి. ఏంచెయ్యనూ?" అని ఒక పెద్దమనిషి అడుగుతే "వెంటనే చచ్చిపో, నలుగురూ గొప్పగా చెప్పుకుంటారు" అని సలహా యిచ్చాడుట ఒక బుద్ధిమంతుడు. బతికున్నంత కాలం, "చావా చావడు. చాపా యివ్వడు" అని ఎదురు చూసిన పెద్దమనుషులందరూ ఆ ప్రాణం కాస్తా అంతరించగానే "ఓహో, బ్రతుకంటే ఫలానా పంతులుగారిదండీ! ఓ నక్షత్రం రాలిపోయింది గదుటండీ" అని నిష్ప్రయోజకరమైన సానుభూతి కనపర్చడానికిమాత్రం వెనుకంజ వెయ్యరు. అందుకనే సానుభూతి సభలూ, సంతాపకర సమావేశాలూ ఎక్కువయిపోతున్నాయి. సమాధులూ, రాతిపై వ్రాతలూ మిగిలిపోతున్నాయి.

* * *

"మా కొంపలన్నీ పాడుచేశావే
మా ఆస్తులన్నీ బీడుచేశావే,
ఏం చేశామమ్మా ఏం చేశాం?
ఎందుకమ్మా గోదావరీ అంతకోపం?
శాంతించుతల్లీ శాంతించు"

అని ఒకసోదరుడు క్రిందటేటి గోదావరి వరద సందర్భంలో కాబోలు గానంచేశాడు. అతని శోకాలాపన గోదావరి వింటో లేదోగాని విన్న సామాన్యులకు మాత్రం చాలా బాధనిపించింది. బాధితులకు వెగటుగాకూడా తోచివుండవచ్చు. కారణం పద్యాలు నాటకంతోనూ, పాటలు దుఃఖసమయంతో జోకొట్టడానికి పనికివస్తాయి. సహజమైన హీనస్థితికి నిజమైన, కార్యాత్మకమైన సానుభూతి కావాలి. కొంపాగోడూ పోయిన వాడికి చేతనైతే పావలా డబ్బులు సాయం చెయ్యాలి. మనదగ్గిరలేదూ, ఊరుకోవడం ఉత్తమం. కరుణచిందించే కావ్యాలూ, దైన్యాన్ని సూచించే ప్రదర్శనలూ అనవసరం. అనుచితం. "చూడు నాయనా, నీ చెల్లెలికి నిలువ నీడలేక పోయింది, నీ తమ్ముడికి గుప్పెడు మెతుకులు కరువయ్యాయి. నీకు తోచిన రూపాయి, అర్థ, పావలా..." అని మృదుమధురంగా ఉపన్యసించడంఎందుకు, "నువ్విచ్చింది ఎంత పంతులూ?" అని అడిగించుకోడం ఎందుకు?

* * *

విజయనగరంలో మా బంధువురాలొకతె ఉంది. పిల్లికి బిచ్చంపెట్టదు. అవసరంగొద్దీ మా యింటి నౌకరు ఒకడు అక్కడికి వెళ్ళడం సంభవించింది. నోటి మాటలతో పొంగిస్తూనే ఉన్న నాలుగురోజుల్లో ఊరగాయముక్కకికూడ కరువు చేసింది ఆ యిల్లాలు. మేం అడుగుతే నౌఖరుది అంటుందీ, "మాయమ్మ గొప్పయిల్లాలే. పెదిమలమీద బూర్లు వండిస్తుంది." ఈ రకం వ్యక్తుల్ని చూసినప్పుడల్లా నాకు యీ మాటే జ్ఞాపకం వస్తుంది. కడుపులోలేనిది కౌగలించుకుంటే రాదు. కబుర్లలో అసలురాదు.

